క్లుప్తంగా

పోటా పోటీగా వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: ప్యాక్షన్ గ్రామమైన బోయలకుంట్లలో మంగళవారం ఆలయాల మాన్యం భూముల కౌలు బహిరంగ వేలం పాటలు పోటాపోటీగా జరిగాయి. గ్రామంలోని శ్రీ ఈశ్వర, ఆంజనేయ,అనంత పద్మస్వామి ఆలయాలకు గతేడాది కంటే రూ. 1.45 లక్షలు అధికంగా సమకూరింది. గతేడాది ఆలయాలకు రూ. 14.03 లక్షలు రాగా ఈ ఏడాది రూ. 15.48 లక్షలు వచ్చింది. వేలం పాటలో ఈఓ రామాంజనేయ శర్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దొర్నిపాడు: మండల కేంద్రంలోని దేవాలయా ల భూములకు సంబంధించి సోమవారం ఈఓ వీరయ్య కౌలువేలం పాటలు నిర్వహించారు. మాధవస్వామి దేవస్థానానికి చెందిన 49.61 ఎకరాలకు రూ.5.25 లక్షలకు వేలం పాడి రైతులు కౌలుకు దక్కించుకున్నారు. గతేడాది తో పోల్చితే రూ.17 వేలు ఆదాయం తగ్గినట్లు చెప్పారు. అలాగే గణాధిపతి, చౌడేశ్వరి ఆలయాలకు చెందిన 26.04 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.4.04 లక్షలకు రైతులు కౌ లుకు దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చితే రూ.73 వేల ఆదాయం తగ్గినట్లు ఈఓ తెలిపారు.

హైస్కూళ్లకు హెచ్ఎంల నియామకం

ఉయ్యాలవాడ: మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు నియామకం అయినట్లు ఎంఈఓ 1 రఘురామిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గిద్దలూరు ఉన్నత పాఠశాల నుంచి విజయకుమార్, బోడెమ్మనూరుకు ఈర్నపాడు నుంచి శరభారెడ్డి, హరివరానికి మద్దూరు నుంచి మధుసూదన్ ప్రధానోపాధ్యాయులుగా నియమితులయ్యారని వెల్లడించారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

నంద్యాల(అర్బన్): కేసీ కాల్వ తెగిపోయిన చోట మరమ్మతులు చేపట్టాలని కేసీకెనాల్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు కోరారు. ఒక్కో డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పరిధిలో ఆరేడు చోట్ల నిధులు అవసరమైతే రెండు చోట్ల పనులకు మాత్రమే నిధులు కేటాయించడం సరికాదన్నారు. స్థానిక కేసీ కెనాల్ కార్యాలయ ఆవరణలో సోమవారం కేసీకెనాల్ ప్రాజెక్టు చైర్మన్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నీటి వినియోగదారుల యాజమాన్య సంఘాల సమావేశం నిర్వహించారు. ఈఈ ప్రతాప్ హాజరైన ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న మస్తాన్‌వలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగ కుటుంబాలకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. ఇళ్ల వద్దకే వచ్చి డీలర్లు సరుకులు అందించేలా చూడాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సభ్యులు బాలతిమ్మయ్య, అబ్దుల్ హమీద్, గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని, ఇందుకు ఎన్‌సీసీని వేదికగా చేసుకోవాలని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ జోబీ పిలిప్, సీఐ మల్లికార్జున పేర్కొన్నారు. పట్టణంలోని 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో 2047 వికసిత్ భారత్ ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ లలితాసరస్వతి, ఎన్‌సీసీ ఆఫీసర్లు శ్రీదేవి, గీతాంజలి, కమాల్‌ఖాన్, ధర్మేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు చర్యలు

- విరివిగా టీబీ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు
- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

గోస్పాడు: జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉద్ధృత క్షయ నిర్ధారణ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2030 నాటికి ఈ వ్యాధిని రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో భాగంగా విరివిగా టీబీ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. జిల్లాలో 2 లక్షల మందికి టీబీ పరీక్షలు నిర్వహించగా వెయ్యి మందికి వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. వారికి అవసరమైన వైద్య సదుపాయం సైతం కల్పించినట్లు చెప్పారు. టీబీ కేసులు తగ్గించేందుకు జూన్ 2 నుంచి ఉద్ధృత క్షయ నిర్ధారణ పరీక్ష సదస్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌పీవై స్కీం ద్వారా నెలకు రూ.1000, నిక్షయ్ మిత్ర దాతల ద్వారా నెలకు రూ.500 నుంచి రూ.700 విలువ గల ఫుడ్ బాస్కెట్స్, న్యూట్రిషన్ సపోర్టుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ శారదాబాయి, తదితరులు పాల్గొన్నారు.

6 లక్షల మంది యోగాంధ్రయాప్‌లో నమోదు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 6 లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో నమోదైనట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో యోగాంధ్ర-2025 కార్యక్రమం నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటర్, మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ విద్యార్థులను యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయి ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన ట్రైనర్లకు ఒక్కొకరికి 50 మందిని కేటాయిస్తామని, వారు మూడు రోజుల్లో శిక్షణ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నోడల్ ఆఫీసర్‌ను కలెక్టర్ ఆదేశించారు. మహానందిలో 7వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం నంద్యాలలోని వైఎస్సార్ సెంటినరీ సమావేశ భవనంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని లైన్ డిపార్టుమెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చూడాలన్నారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు తదితర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డీపీఓ, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. మురికి నీరు రోడ్లపై ప్రవహించకుండా వాటిని ఎప్పకప్పుడు శుభ్రం చేయాలని, వారానికి ఒకసారి అయినా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి మందులు పిచికారీ చేయాలని చెప్పారు. మలేరియా ర్యాపిడ్ కిట్లు, మందులను అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింకేజీ తప్పనిసరి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు బదిలీ కోసం పోస్టల్ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకేజీ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఎన్‌పీసీఐ లింకేజీపై పోస్టల్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈనెల 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజీ చేయాలన్నారు. ఎవరైనా చేయించుకోకపోతే వారికి ప్రభుత్వం నుంచి నగదు బదిలీకి ఇబ్బంది అవుతుందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

జేఈఈ ఫలితాల్లో ఎస్‌డీఆర్ విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. పలువురు విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. సృజన్-559 (ఏఐఆర్), చరణ్-2370 (ఏఐఆర్) ర్యాంకు తెచ్చుకున్నారన్నారు.. వీరితో పాటు 5 వేలలోపు ముగ్గురికి , పది వేలలోపు నాలుగురికి ర్యాంకులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ ర్యాంకులు సాధించడానికి తోడ్పాటునందించిన అధ్యాపకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మాన్యం కౌలుకు వేలం పాట

రుద్రవరం: రుద్రవరంలోని భాస్కర నందీశ్వర స్వామి ఆల యంలో దేవదాయశాఖ అధికారులు సోమవారం మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించారు. ఈఓ సాయి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ భాస్కర నందీశ్వర, ఆంజనేయ, దొర్ని లక్ష్మీనరసింహ్మస్వామి అమ్మవార్ల ఆలయాలన్నీ కలిపి 36.79ఎకరాల మాన్యం ఉందన్నారు. వాటికి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించిన రూ.5.23 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది రూ.3.11 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది అదనంగా రూ.2.12లక్ష లు ఆదాయం పెరిగినట్లు ఈఓ తెలిపారు.

పరిష్కారం చూపని పీజీఆర్ఎస్



ఉయ్యాలవాడలో ఈద్గా సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న ముస్లింలు

ఉయ్యాలవాడ : ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. అర్జీలను పరిశీలించి పరిష్కరించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యయా ప్రయాసలు కూర్చి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భూ సంబంధ సమస్యలపై రెవెన్యూ అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పికుంటున్నారని, తమ గోడు పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి ప్రజలు అర్జీలు తీసుకొని వచ్చారు. ఉయ్యాలవాడలో ఈద్గా ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చినా స్పందన లేదని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేశారు.

సమయపాలన లేదు

చాగలమర్రి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదు. పీజీఆర్ఎస్ కార్యాక్రమానికి సోమవారం ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఉదయం 9.30 గంటలకు హాజరు కాగా మిగతా అధికారులు ఆలస్యంగా వచ్చారు.తహసీల్దార్ రవికుమార్ ఏకంగా 11 గంటలకు హాజరయ్యారు. కొందరు ఈ కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. సమస్యలు చెప్పుకునేందుకు తాము గ్రామాల నుంచి వస్తే అధికారులు లేకపోతే ఎలా అని అర్జీదారులు మండిపడుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



కోర్టు ఆవరణలో భూమి పూజ నిర్వహిస్తున్న జడ్జి అమ్మన్నరాజు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల కోర్ట్ ఆవరణలో ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన రాజు భూమి పూజ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి ముక్కెర కృష్ణారెడ్డి మాట్లాడుతూ కోర్టు ఆవరణలో గోడ శిథిలమవడంతో ఆర్అండ్‌బీ నిధులు రూ. 23 లక్షలతోబనిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, లింగమయ్య, ఓబుళరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు శ్రీనివాస్, తిరుపాలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా జాబితా



మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ బదిలీల గ్రీవెన్స్ ఫిర్యాదులు విద్యాశాఖ అధికారులకు పట్టడం లేదని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని ఆయూనియన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ ఫిర్యాదులు పరిష్కరించకుండానే చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారన్నారు. బదిలీల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని, సరి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా సహాయకులు నరసింహారావు, సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక



ర్యాలీ చేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: టీబీ వ్యాధి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక అమలవుతుందని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు అన్నారు. మంగళవారం టీబీ ముక్త అభయాన్‌పై ర్యాలీ జరిగింది. ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజల్లో అపోహలున్నాయని వాటిని తొలగించడంతో పాటు సమాజాన్ని జాగృత్తం చేస్తున్నామన్నారు. షుగర్ వ్యాధి గ్రస్తులు, ధూమపాన, మద్య పాన ప్రియులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, మురిక వాడ ప్రజలల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. దీంతో టీబీ వ్యాధి వారికి త్వరగా వ్యాప్తి చెందే అవకాశం అధికమన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయం కాలం జ్వరం రావడం, రాత్రి పూట చెమటలు పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, నీరసం వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండో రోజు..అదే అవస్థ



సర్వర్ పనిచేయకపోవడంతో చెంచుగూడెంలో రేషన్ షాపు బయట నిల్చున్న కార్డుదారులు



ముత్యాలపాడు డీలర్ షాపు వద్ద పడిగాపులు కాస్తున్న పేదలు

చాగలమర్రి: రేషన్ డోర్ డెలివరీని కూటమి ప్రభుత్వం స్వస్తి పలకడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండో రోజు సోమవారం పలుగ్రామాల్లో సర్వర్‌లు పనిచేయక కార్డుదారులు గంటలతరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంటి దగ్గరకే రేషన్ బండి వచ్చేటప్పుడు ఎంతో సదుపాయంగా ఉండేదని, కూటమి సర్కారు రాకతో మళ్లీ తమకు పాత కష్టాలు మొదలయ్యాయని పేదలు వాపోతున్నారు. చాగలమర్రి మండలం డి.వనిపెంట పంచాయతీ పరిధిలోని చెంచుగూడెంలో ఏర్పాటు చేసిన డీలర్ షాపు వద్దకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓంటిగుడిసె తండాకు చెందిన కార్డుదారులు వచ్చి రేషన్ తీసుకెళ్లాల్సి వచ్చింది. చాలా మంది తండావాసులు పనులు వదులుకొని ఉదయం దుకాణం వద్దకు వస్తే సర్వర్ పనిచేయలేదు. దీంతో వారు దిక్కుతోచక రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజవర్గాల్లోని పలు గ్రామాల్లో సోమవారం ఇదే పరిస్థితి కనిపించింది.

నిబంధనలు పాటించని పాఠశాలలను సీజ్ చేయాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయని ఆరోపించారు. జిల్లాలో విద్యను వ్యాపారం చేశారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠ్యపుస్తకాల కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి అలాంటి పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, సాయికుమార్, జోసెఫ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఇంజినీరింగ్ కార్మికులను వేధిస్తూ అసభ్య కరంగా మాట్లాడుతున్న మున్సిపల్ డీఈ నాగభూషణంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు మహమ్మద్‌గౌస్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కన్వీనర్ భాస్కరాచారి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.అంతకు ముందు వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను డీఈ వేధింపులకు గురి చేయడంతో పాటు బానిసల మాదిరిగా చూస్తున్నారని మండిపడ్డారు.ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, చైర్‌పర్సన్ మాబున్నిసా హామీ మేరకు ఆందోళన కార్యక్రమాలు విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, రంగనాథ్, ఆదాం , రామకృష్ణ, సిద్దయ్య, బాలరంగయ్య, మురళీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



శిక్షణ పొందిన బాలికలతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన దృశ్యం



పదోతరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ప్రముఖులు

నంద్యాల(వ్యవసాయం): తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు కళలు, లలిత కళల్లో కూడా ప్రోత్సహించాలని గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కళాసాధన -2025 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కళారాధన సంస్థ గత 24 సంవత్సరాల నుంచి లయన్స్‌క్లబ్, ఐఎంఏ, రోటరీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సంస్థ సహకారంతో సాగడం ఎంతో గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో ఎవరికీ రానటువంటి అవార్డులు ఈ సంస్థకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి మరింత మెరుగు పరచడానికి నెల రోజులు వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారన్నారు. తర్వాత పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రిటైర్డు జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణయ్య పురస్కారాలు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, సినీ లలిత గానాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళారాధన సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, సత్యనారాయణ, శివకుమార్‌నాయుడు, రంగనాథ్, తదితర లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల గోడు పట్టదా?



ధర్నా చేస్తున్న సీపీఎం నాయులు

నంద్యాల(న్యూటౌన్): అధికారులకు ప్రజల గోడు పట్టడం లేదని, పీజీఆర్ఎస్‌ను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు పుల్లా నరసింహులు అన్నారు. సోమవారం ప్రజా సమస్యలు విన్నవించేందుకు కలెక్టర్ వద్దకు వెళితే ఆసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో కంపెనీలు దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. రైతుల భూములను బలవంతంగా లాక్కోవడంతో పాటు పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే 212 సర్వేనంబరులో బంజరు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు, పిన్నాపురం రైతులు ప్రసాద్, రమేష్, మాసమయ్య, చిన్నస్వామి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): బీసీ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా నంద్యాలకు చెందిన నందవరం శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన బీసీ చైతన్య వేదిక కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు నంద్యాల జిల్లాకు చెందిన నందవరం శ్రీనివాసులును రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను వాడుకుంటున్నారే తప్ప వారి ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై ఆలోచనలు చేయడం లేదన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

నంద్యాల(వ్యవసాయం): గోవధ నిషేధిత చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్రీయ ధర్మరక్షాదళ్ ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు నవీన్‌గౌడ్, రాంచరణ్‌లు మాట్లాడుతూ జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని, అధికారులు గోవధ చట్టం 1977లోని 5, 6, 7, 8 సెక్షన్లను కఠినంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, గోపి, మోహన్, ప్రతాప్, శివ, సతీష్, కల్యాణ్ ఆచారి, మండ్ల గంగాధర్, ప్రసాదరాజు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు రుణాలు

ఉయ్యాలవాడ : మండలంలోని పొదుపు లక్ష్మి 6 గ్రూపులకు రూ. 52.35 లక్షలు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేసినట్లు ఏపీఎం దాస్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామీణ బ్యాంకు ద్వారా నాలుగు గ్రూపులకు రూ. 45 లక్షలు, సంజామల మండలంలోని నొస్సం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా పుచ్చకాయలపల్లె గ్రామంలోని రెండు గ్రూపులకు రూ. 7.35 లక్షలు రుణాలు అందజేసినట్లు ఆయన వెల్లడించారు.